ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 19.05.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యం కావాలని ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దిశా నిర్దేశం చేశారు.

2. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

3. ఢిల్లీలో స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్షా సమావేశానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు.

4. తెలంగాణలో రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

-----------------------------------------

**గవర్నర్**

హైదరాబాద్ లోని లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ శాంతి కుమారి ఆధ్వర్యంలో 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ వారిని అభినందిస్తూ, అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలని దిశా నిర్దేశం చేశారు. ప్రతి నిర్ణయంలో ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యం కావాలని, పరిపాలనలో నిజాయితీతో ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాలని సూచించారు. పదవి అనేది ఒక

అధికారం మాత్రమే కాదని, అది ఒక పెద్ద బాధ్యత అనే విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి పౌరుని సమస్యను సున్నితంగా అర్థం చేసుకుని పరిష్కరించాలని, రాష్ట్రాభివృద్ధికి కీలకంగా మారాలని అధికారులను కోరారు.

**డెస్క్**

----------------------------

**సరస్వతీ నది అంత్య పుష్కరాలు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలకు హాజరవ్వాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. గవర్నర్ ను లోక్ భవన్‌లో నిన్న కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

**డెస్క్**

------------------------------

**రేవంత్ రెడ్డి**

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని, జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలయినంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డెస్క్

----------------------------------

**అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం**

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ రాష్ట్ర మ్యూజియంలో నిర్వహించిన కార్యక్రమానికి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మ్యూజియాలు మన నాగరికత, సంస్కృతులకు అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని, వారసత్వ సంపదను రక్షించడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. చారిత్రక ప్రాంతాల్లో స్థానిక యువతకు గైడ్‌లుగా శిక్షణ ఇచ్చేందుకు 5 కోట్ల రూపాయలు కేటాయిస్తామని వెల్లడించారు. పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ... ఆర్కియాలజీ రంగంలో నూతన కోర్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పలు పుస్తకాలను ఆవిష్కరించగా, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, చరిత్రకారులు పాల్గొన్నారు.

**డెస్క్**

-----------------------------------

**సమీక్షా సమావేశం**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రేషన్ కార్డుల మంజూరు, తాగునీరు, వైద్యం, గృహాలు, మహిళల రక్షణ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని, జవహార్‌నగర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే వర్షాకాలానికి ముందే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మరమ్మతులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పిటిసి, మేడ్చల్

---------------------------------

**జోగులాంబ గద్వాల**

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో ఈరోజు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ దిశా సమావేశం నిర్వహించారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల పురోగతిపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్, తదితరులు పాల్గొన్నారు.

పిటిసి, గద్వాల

--------------------------------

**హైదరాబాద్ పోలీసులు**

మెహిదీపట్నం, గుడిమల్కాపూర్ పరిసరాల్లో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సోషల్ మీడియాలో మతపరమైన విద్వేషాలు రగిలిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న 17 అకౌంట్లపై చర్యలు తీసుకోవాలని 'ఎక్స్ కార్పొరేషన్' లీగల్ విభాగానికి నోటీసులు జారీ చేశారు. ఐటీ చట్టం, BNSS లోని వివిధ సెక్షన్ల కింద ఈ లీగల్ నోటీసులను పంపినట్లు పోలీసులు తెలిపారు.

డెస్క్

------------------------------

**పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల**

అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, దేశీయ ఆర్థిక పరిస్థితుల వల్ల దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను చమురు సంస్థలు పెంచాయి. తాజా సవరణ ప్రకారం లీటరుపై సగటున 90 పైసల భారం పెరిగింది. స్థానిక పన్నుల ఆధారంగా వివిధ నగరాల్లో ఈ పెంపు 80 పైసల నుండి రూపాయి వరకు ఉంది. పెరిగిన ధరలతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర 111 రూపాయల 78 పైసలకు పెరిగింది. లీటర్ డీజిల్ ధర 98 రూపాయల 90 పైసలుగా ఉంది.

డెస్క్

---------------------------

**అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

రాష్ట్రంలో రైతులు పండించిన అధిక ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా కొనుగోలు చేయాలని కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ...

బైట్ ... అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పిటిసి, రాజన్న సిరిసిల్ల

---------------------------------

**భట్టి విక్రమార్క**

న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా పట్టణ పారిశుద్ధ్యం, సుస్థిర వ్యర్థ నిర్వహణ, స్వచ్ఛ భారత్ మిషన్ అమలు పురోగతి వంటి అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు తోఖన్ సాహు, అరుణ్ సావో, MoHUA కార్యదర్శి శ్రీనివాస్ కాకితాల, రూపా మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.

డెస్క్

--------------------------------

**TELANGANA INTER**

తెలంగాణ రాష్ట్రంలో ఈరోజు జరగనున్న ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో కెమిస్ట్రీ పేపర్ 2, కామర్స్ పేపర్ -2 పరీక్షలకు సెట్ A ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు తెలియచేసింది.

**DESK**

--------------------------

**జనగామ జిల్లా కలెక్టర్**

మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 19 వేల 450 మంది రైతుల నుండి లక్ష 5 వేల 012 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, అందులో 97 వేల 872 మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించామని, 14 వేల 190 మంది రైతుల ఖాతాల్లో 175 కోట్లు 32 లక్షల రూపాయలు జమ చేశామని తెలిపారు. రవాణా, అన్‌లోడింగ్‌లో జాప్యం జరగకుండా 267 వాహనాలు అందుబాటులో ఉంచామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను స్పష్టం చేశారు.

పిటిసి, జనగామ

-------------------------------

**నల్లగొండ జిల్లా కలెక్టర్**

ప్రభుత్వ భూముల్లోనే కాకుండా ప్రైవేట్ భూముల్లో కూడా ఉన్న అటవీ ప్రాంతాలను గుర్తించి వాటిని పరిరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. అడవుల సంరక్షణపై కలెక్టర్ మాట్లాడుతూ... అడవుల పరిరక్షణతో పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందనీ, అందుకే అటవీ సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా సర్వే నిర్వహించి చెట్ల సాంద్రత ఎక్కువగా ఉన్న

ప్రాంతాలను గుర్తిస్తూ, డీమ్‌డ్ ఫారెస్ట్ గా గుర్తింపు పొందే ప్రాంతాల వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు.

పిటిసి, నల్గొండ

------------------------------------

**భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టూరిజం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో మే 23 వరకు పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, యువత టూరిజం రంగంపై అవగాహన పెంచుకొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం

----------------------------

**సూర్యాపేట జిల్లా టూరిజం అధికారి**

తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, మ్యూజియాల వివరాలను పర్యాటకులకు వివరించేందుకు పురావస్తు, మ్యూజియాలజీ కోర్సుల శిక్షణకు డిగ్రీ అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూర్యాపేట జిల్లా టూరిజం అధికారి బి. వెంకట్ రెడ్డి కోరారు. శిక్షణ అనంతరం గైడ్‌లుగా ఉపాధి పొందవచ్చని, ఆసక్తి గలవారు జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేయాలని లేదా 98 49 90 57 22 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పిటిసి, నల్గొండ

--------------------------------

**మంచిర్యాల జిల్లా కలెక్టర్**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జైపూర్ మండలం, టేకుమట్ల, షెట్ పల్లి లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.

పిటిసి, మంచిర్యాల

-------------------------------------

**చెక్‌పోస్ట్ తనిఖీ**

బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణా నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన మహబూబాబాద్ జిల్లా, నామాలపాడు చెక్‌పోస్ట్ ను జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరగేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టామని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

పిటిసి, మహబూబాబాద్

----------------------------

**ఆచార్య ఎస్ రమణ**

కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్ రమణ వెల్లడించారు.

నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడంలో సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని, ఈ గుర్తింపు బాధ్యతను మరింత పెంచిందని ఆయనకు సందర్భంగా పేర్కొన్నారు. ఈ గుర్తింపుకు సంబంధించిన అధికారిక పత్రాలను వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రతాప్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బందిని వైస్ ఛాన్సలర్ ప్రతాప్ రెడ్డి అభినందించారు.

పిటిసి, వరంగల్

---------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరించింది. ఇదే సమయంలో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర క్రమంగా పెరుగుతాయని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నల్గొండ, ఖమ్మం తదితర జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశం ఉందని, నాల్గవ రోజు నుంచి పొడి వాతావరణం ఏర్పడుతుందని వెల్లడించింది.

డెస్క్/పిఎన్

----------------------------------